క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయాలు

టి.నరసాపురం: మండలంలోని మక్కినవారి గూడెం 33/11కేవీ పరిధిలోని సున్నపురాళ్లపల్లి ఫీడర్, 33/11కేవీ టి.నరసాపురం పరిధిలోని 11కేవీ ఆర్కేఆర్ గూడెం ఫీడర్లలో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున ఈ నెల 30 నుంచి జూలై 4వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతాయని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం



గవరవరంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరంలో ఆదివారం కేన్సర్ స్క్రీనింగ్ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం 150 మందికి పైగా స్త్రీలకు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. మహిళలలో ఎదురవుతున్న కేన్సర్ సమస్యల గురించి అవగాహన కల్పించారు. మాజీ జెడ్పీటీసీ ఎస్ఆర్ఆర్ సుభద్ర దేవి మహిళలకు సేవలు అందించి బ్రెస్ట్, గర్భాశయ ముఖం కేన్సర్ గురించి వివరించారు. మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహ రాజు సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు.

భారతీయ సంవిధాన్ హత్య దివస్



బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భారతీయ సంవిధాన్ హత్య దివస్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో పట్టణ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పూర్వ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడుతూ 1975 నుంచి 1977 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, నాటి జన సంఘం నేతలను, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఇళ్ల మీదకి జొరబడి దాడి చేసి వాళ్లని అరెస్టు చేశారన్నారు. ఈ సందర్భంలో మన జంగారెడ్డిగూడెం పట్టణ ప్రాంతానికి చెందిన వార్డెన్ శర్మగా సుపరిచితులైన సూరంపూడి సుబ్బారాయ శర్మ అప్పట్లో ఇబ్బందులు పడ్డారన్నారు. పట్టణ బీజేపీ తరుపున సుబ్బరాయశర్మను సన్మానించారు.

మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మానవత జంగారెడ్డిగూడెం మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు అయినాల రమణమూర్తి ఆధ్వర్యంలో గుర్వాయిగూడెం మానవత కమ్యూనిటీ హాల్ నందు ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కర్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా అల్లూరి రాకమృష్ణ, కార్యదర్శిగా మధుకుమార్, ట్రెజరర్‌గా ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షుడిగా గంధం గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా బేతా రమేష్, ఈసీ సభ్యులుగా మాతంశెట్టి నాగేశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, తన్నీరు రామకృష్ణ, దారా సురేష్‌గుప్త ప్రమాణస్వీకారం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కల్పవృక్షం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ నేత, పారిశ్రామికవేత్త దివంగత పోతన శేషగిరిరావు శేషు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణేష్ రాయుడు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, పోలవరం, గొల్లగూడెంలోని వృద్ధాశ్రమాలకు శేషగిరిరావు సహాయ సహకారాలు అందించారని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు పేర్కొన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజా గణేష్ రాయుడు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

టీచర్ల బదిలీల్లో ఏజెన్సీపై చిన్నచూపు

- ఏజెన్సీలో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- అగమ్యగోచరంగా ప్రభుత్వ విద్య
- చిన్నారుల చదువులు సాగేనా అని తల్లిదండ్రుల ఆవేదన



కివ్వాక ప్రభుత్వ పాఠశాల

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అగమ్యగోచరంగా తయారైంది. పాఠశాలలో విద్యార్థులు సరిపడా ఉన్నా పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ చిన్నారుల చదువులు ఎలా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితికి కారణం ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలలే కారణమన్నట్టు తెలుస్తుంది. బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతానికి ప్రాముఖ్యత నివ్వాల్సిన ప్రభుత్వం ఆ పరంగా చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని తల్లిదండ్రులు వాఖ్యానిస్తున్నారు.

ఉపాధ్యాయుల కొరతతో అందని విద్య

ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా వేరే ప్రాంతాలకు బదిలీ చేసిన అధికారులు ఈ బదిలీ చేసిన స్థానాన్ని భర్తీ చేయకపోవడంతోనే ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. కుక్కునూరు మండల వ్యాప్తంగా 32 ఎంపీపీఎస్, 11 ఎంపీయూపీఎస్, 3 జెడ్పీపీహెచ్ఎస్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారుగా 3 వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడి పాఠశాలల్లో దాదాపు అందరూ పేద విద్యార్థులే ఉంటారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కూడా ఎక్కువగానే ఉంటుంది. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండే ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయులను కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిన తరువాత విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ని నియమించాల్సిన ప్రభుత్వం ఇక్కడి వారిని బదిలీ చేసేటప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకోని ఉంటే బాగుండేదని ప్రజాసంఘాల నాయకులు అంటున్నారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడంతోనే పరిస్థితి ఇలా తయారైందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుక్కునూరు మండలంలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు వివరాలు

పాఠశాల	మొత్తం పాఠశాలలు	కేటాయించిన పోస్టులు	ఖాళీగా ఉన్న పోస్టులు
ఎంపీపీఎస్	37	73	55
ఎంపీయూపీఎస్	6	35	24
జెడ్పీహెచ్ఎస్	3	33	15
మొత్తం	46	141	96

సమస్యను డీఈవోకి వివరించాం

ఈ విషయమై కుక్కునూరు ఎంఈఓ తెల్లం బాబురావుని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ, మండలంలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. దీంతో కొందరిని డిప్యూటేషన్‌పై వెనక్కి రప్పించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి



మండలంలోని పాఠశాలల్లో దాదాపు అందరూ పేద విద్యార్థులే. వారు ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లలేరు. ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

– పగ్గిళ్ల అల్లేష్, కివ్వాక, కుక్కునూరు

ఏజెన్సీ ప్రాంతంపై నిర్లక్ష్యం తగదు



ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతానికి ప్రాముఖ్యత నిచ్చి ఉద్యోగులను కేటాయించాల్సింది పోయి ఇక్కడి వారిని బదిలీ చేసింది. ఏజెన్సీ ప్రాంతంపై నిర్లక్ష్యంతో కుక్కునూరు మండలంలో ఉపాధ్యాయులను నియమించలేదు. ఇప్పటికే టీచర్ల బదిలీలు ముగిశాయి. మరలా డీఎస్సీ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడితే తప్ప ఉపాధ్యాయుల నియామకం జరగదు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో విద్యాహక్కు చట్టాన్ని హరిస్తుంది. వెంటనే ఉపాధ్యాయులను పూర్తి స్థాయిలో కేటాయించాలి.

– కొలికపోగు లెనిన్, ఎస్ఎఫ్ఐ, ఏలూరు జిల్లా కార్యదర్శి

దాసు సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా సంధ్య



పల్లం సంధ్య

కుక్కునూరు: కుక్కునూరు మండల దాసు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పల్లం సంధ్యారాణి, బట్టు కమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ సమావేశం ఉప్పేరులో జరిగింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ, దాసు సామాజిక వర్గ ఐక్యతకు, అభివృద్ధికి, సంస్కృతి, సాంప్రదాయలను కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా పల్లం పార్వతి, సహాయ కార్యదర్శిగా పాముల లక్ష్మణ్‌రావు, కోశాధికారిగా సీహెచ్ నారాయణదాస్, కార్యవర్గ సభ్యులుగా యర్నం నరసింహరావు, పాముల కాళిదాసు, వాసు, రమాదేవి తదితరులను ఎన్నుకున్నారు.

జెండా దిమ్మెల ఏర్పాటు

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం, అచ్చియ్యపాలెంలో ఆదివారం జెండా దిమ్మెల నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమాలను ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సోంపల్లి సిద్దు, కూచిపూడి సత్యం మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీ నిర్మాణం, ఇంటర్, డిగ్రీ, పీజీ చేస్తున్న యువకులతో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జెండా దిమ్మెల నిర్మాణం కూడా చేపడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు బొబ్బర ఎలీషా, చిడిపి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్య సేవలు ఎనలేనివి



బుచ్చయ్య దంపతులను సత్కరిస్తున్న పొగాకు బోర్డు ఆర్ఎం, అధికారులు, రైతు సంఘం ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రం పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్ బి.బుచ్చయ్య రైతులకు అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు ప్రశంసించారు. ఆదివారం స్థానిక 1వ వేలం కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్ బి.బుచ్చయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా వర్జీనియా పొగాకు సంఘం ఆధ్వర్యంలో ఆయనకు వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేలం కేంద్రంలో వేలం ప్రక్రియ కొనసాగే సమయంలో విధులు నిర్వహించడం కత్తి మీద సాము లాంటిందని, ఒక పక్క వేలం ప్రక్రియను సజావుగా సాగేలా చేయడంతో పాటు, రైతులను సమన్వయ పరుచుకోవడం కూడా అవసరం అన్నారు. ఈ విషయంలో వేలం అధికారులకు తన అనుభవంతో తోడుగా ఉండి అందరి మన్ననలు బుచ్చయ్య పొందగలిగారన్నారు. కార్యక్రమంలో బుచ్చయ్య, రమణమ్మ దంపతులను దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, వేలం అధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో సుధీర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, వర్జీనియా పొగాకు రైతు సంఘం నాయకులు గడ్డమణుగు దత్తుడు, గద్దే లక్ష్మణరావు, కరాటం రెడ్డిబాబు, పరిమి రాంబాబు, ఘంటశాల గాంధీ, అల్లూరి రామకృష్ణ, వామిశెట్టి హరిబాబు, సుంకవల్లి వీరభద్రరావు, గద్దే రాజేంద్రప్రసాద్, ఆకుల రాకేష్, రైతులు పాల్గొన్నారు.



శ్రీవారి దేవస్థానం పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

'అపూర్వ' సమ్మేళనం

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1991–1992 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులంతా కలుసుకున్నారు. 33 ఏళ్ల తరువాత ఒక చోటకు చేరిన వీరంతా చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలాగే ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



డీవైఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు కె అచ్చిబాబు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి సూర్యకిరణ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చాలని, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా జాబ్ కేలండర్ విడుదల చేయలేదని, దీంతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల కోసం 10 లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్ ఖాళీ పోస్టులు, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అటవీశాఖలోని 800 బీట్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆర్థికశాఖ అనుమతినిచ్చినా ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో 15 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఖాళీగా ఉన్న 3 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీ ద్వారా ఇచ్చిన 18 నోటిఫికేషన్ల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ ప్రకటించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.అశోక్, సురేష్, పి.పోతురాజు, శివమణి, నరేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శలు



దేవినేనివారిగూడెంలో సత్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ హోం మంత్రి వనిత

ద్వారకాతిరుమల: మండలంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను, వారి కుటుంబాలను రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. ఎం.నాగులపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిలక ఏసు కుటుంబాన్ని ఆమె పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న పడమటి చంద్రయ్యను పరామర్శించారు. అలాగే దేవినేనివారిగూడెంలో ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ సీనియర్ నాయకుడు ఆకుర్తి సత్యన్నారాయణను, కాలుకి శస్త్రచికిత్స చేయించుకున్న పెండ్లి దుర్గయ్యను, కిడ్నీ వ్యాధితో బాదపడుతున్న పెండ్లి పాపాయమ్మను, పక్షవాతంతో బాదపడుతున్న పెండ్లి సత్యన్నారాయణను, పెండ్లి చెన్నయ్య కుటుంబాన్ని, అదేవిధంగా వేంపాడులో అనారోగ్యంతో బాదపడుతున్న సర్పంచ్ చెవల రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు, ఏపీపీఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పి.జీవన్ కుమార్ మాజీ మంత్రి వనితను వేంపాడులో మర్యాద పూర్వకంగా కలసి, ఆమెకు దుశ్శాలువాను కప్పి, మొక్కను అందించారు. పరామర్శ కార్యక్రమాల్లో ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల పార్టీ కన్వీనర్లు ప్రతాపనేని వాసు, వెల్లంకి సుబ్రహ్మణ్యం, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య, ఎలమర్తి సీతారామయ్య, జెర్రిపోతుల వెంకటేశ్వరరావు, శ్రీనుదాసు, నార్ని అప్పారావు, తూంపాటి భీమేశ్వరరావు తదితరులున్నారు.

కొయ్యలగూడెం.. రోడ్లు దారుణం

కొయ్యలగూడెం: రహదారులు బాగుచేస్తామని అందలమెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో రహదారులపై ఏర్పడిన గోతులతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొయ్యలగూడెంలోని గణేష్ సెంటర్ మొదలుకొని పరింపూడి కన్నాయిగూడెం, అదేవిధంగా మెయిన్ సెంటర్ మొదలుకొని కన్నాపురం రోడ్ ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి. ప్రధానంగా పోలవరం రోడ్డు అధ్వానంగా మారి కుండ గోతులు ఏర్పడడంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఏజెన్సీ మండలాల్లో ఉద్యోగస్తులతో పాటు విద్యార్థులు నిత్యం పోలవరం రోడ్డుపై ప్రయాణించడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొయ్యలగూడెం నుంచి కన్నాపురం మేర ఏడు కిలోమీటర్లు ఉన్న రహదారి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. నిత్యం ఏదో ఒక భారీ వాహనం గోతుల్లో పడి మరమ్మతులకు గురి కావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దిప్పకాయలపాడు మొదలుకొని ప్రధాన రహదారికి రెండువైపులా అడుగుమేర బురద ఏర్పడి వాహనాలు దిగబడి పోతున్నాయి. ఇటీవల యథేచ్ఛగా నెలల తరబడి మట్టి అక్రమ తోలకాలు నిర్వహించడంతో మట్టి పెళ్లలు రోడ్డుపై పడి బురద మయంగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు. అదేవిధంగా గవరవరం, కృష్ణంపాలెం రోడ్డులో భారీ గోతులు ఏర్పడడంతో రబీ సీజన్ ధాన్యాన్ని పొలాల్లోనే కుప్పలుగా వేసి ఉంచాల్సి వస్తుందని, నూర్పుళ్లు నిర్వహించలేకపోతున్నామని రైతులు వాపోయారు. పాలకులు అధికారులు రోడ్ల మరమ్మతు చర్యలు వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



మెయిన్ సెంటర్ రోడ్డులో భారీ గోతులు పడిన దృశ్యం

ప్రమాదాలకు నిలయంగా మారి..



కన్నాపురం రోడ్డు మీదుగా మట్టి, ఇసుక ట్రక్కుల అక్రమ రవాణా ప్రస్తుత సీజన్లో భారీ ఎత్తున కొనసాగింది. దీంతో మెయిన్ రోడ్డు అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. మెయిన్ రోడ్డును వదిలి వాహనాలు గ్రామాల్లోని అంతర్గత రోడ్ల గుండా ప్రయాణిస్తుండడంతో అవి కూడా ధ్వంసమవుతున్నాయి.

– ఎడ్లపల్లి సురేష్, కన్నాపురం

పనులు ముందుకు సాగడం లేదు



రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు అవుతున్నా ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు భారీగా ఆశిస్తుండడం వలన రోడ్ల నిర్మాణానికి ఎవరు ముందుకు రావడంలేదని కూటమి ప్రభుత్వంలోని ఒక వర్గం వారు ప్రచారం చేస్తున్నారు. దీంతో రెండు మార్లు నిధులు మంజూరైన పనులు ముందుకు సాగలేదు.

– తాండ్ర రామకృష్ణ, గవరవరం



రేపల్లెవాడలో ధ్వంసమైన మెయిన్ రోడ్డు



కన్నాపురం రోడ్డు పరిస్థితి ఇలా..



ఛిద్రమైన అంకాలగూడెం రోడ్డు

